క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



విద్యార్థులకు అందజేసిన ప్యాడ్‌లతో దాత

యాలాల: మండల పరిధిలోని కోకట్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్, మర్పల్లి వెంకటయ్యలు తమ తండ్రి బాలప్ప జ్ఞాపకార్థం ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్లుగా తమ తండ్రి జ్ఞాపకార్థం పలురకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని ముందుకు సాగాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. కాగా, దాతలను మాజీ ఎంపీపీ శంకర్, ఉప సర్పంచ్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు పురుషోత్తంరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు బలరాం, అశోక్, యాదప్ప తదితరులు ఉన్నారు.

రాంపూర్‌లో 'బలగం' సినిమా ప్రదర్శన



బలగం సినిమాను వీక్షిస్తున్న రాంపూర్ గ్రామస్తులు

కుల్కచర్ల: గ్రామీణ నేపథ్యంతో విడుదలై అందరి ప్రశంసలు పొందుతున్న బలగం సినిమా చూడటానికి ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. ఉచితంగా ప్రదర్శించిన ఈ సినిమా చూసేందుకు గ్రామస్తులు ఎంతో ఆసక్తి కనబరిచారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, శివాజీ యువజన సంఘం సురేష్, శ్రీశైలం, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్ గౌడ్



తాండూరు టౌన్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఈడిగ శ్రీనివాస్ గౌడ్‌ను నియమించారు. బషీరాబాద్ మండలం రెడ్డిఘనపూర్‌కు చెందిన శ్రీనివాస్ గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యత నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి ఏటా ఏప్రిల్ 11న సామాజిక ఉద్యమకారుడు జ్యోతిబా పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం కమిటీకి సంబంధించిన జీవో విడుదల చేసింది.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

తాండూరు టౌన్: విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బషీరాబాద్ బీసీ బాలికల వసతిగృహ వార్డెన్ శశికళపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలస్యంగా నిద్ర లేచారనే కారణంతో వారికి అల్పాహారం అందించక పోవడం సమంజసం కాదన్నారు. చదువుకునే స్థోమత లేని పేద, మధ్య తరగతి పిల్లలు వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారని, అలాంటి విద్యార్థినులను ఇలా ఇబ్బందులకు గురిచేస్తే ఎలా అని ప్రశ్నించారు. వికారాబాద్ జిల్లా ఏర్పడక ముందు తాండూరులో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కార్యాలయం ఉండేదని, తిరిగి తాండూరులో ఆ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్లపై కలెక్టర్‌తో పాటు బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

పోషణ్ పక్వాడతో సంపూర్ణ ఆరోగ్యం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

దౌల్తాబాద్: పోషణమాసం సందర్భంగా.. నీటూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్త భారతి బాలింతలు, గర్భిణులు, కిషోరబాలికలకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. పోషకాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పించారు.

సమస్యల వలయంలో లైబ్రరీ

విజ్ఞానాన్ని అందించాల్సిన గ్రంథాలయాలు పాలకుల నిర్లక్ష్యానికి శిథిలావస్థకు చేరి.. అరకొర పుస్తకాలతో కుస్తీపడుతున్న నిరుద్యోగులకు శాపంగా మారింది. వర్షాలు కురిసి.. ఉన్న విలువైన పుస్తకాలు తడిసి ముద్దయిపోతున్నాయి. చెదల పాలవుతూ.. నిర్లక్ష్యానికి నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి.



పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ పాత భవనం

దోమ: రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తుండడంతో.. అందుకు నిరుద్యోగ యువత సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ఆర్థిక స్థోమత ఉన్న విద్యార్థులు హైదరాబాద్, తదితర ఇతర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నప్పటికీ.. ఆర్థిక స్థోమత అంతగా లేని నిరుద్యోగ యువత స్థానికంగా నాయకులు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొందుతున్నారు. మరికొందరు గ్రంథాలయాలను నమ్ముకున్నారు. అయితే లైబ్రరీల్లో సరైన వసతులు, పోటీ పరీక్షల పుస్తకాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. పాఠకులకు శాపం

- శిథిలావస్థకు చేరిన పాత బిల్డింగ్
- అలంకారప్రాయంగా నూతన భవనం
- పోటీపరీక్షల పుస్తకాలు లేక నిరుద్యోగుల పరేషాన్

శిథిలావస్థలో భవనం..

మండలంలోని 36 గ్రామ పంచాయతీలకు గాను.. మండల కేంద్రంలో ఒకేఒక్క లైబ్రరీ ఉంది. ఆ గ్రంథాలయ భవనం పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరింది. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు నిత్యం ఆ గ్రామాల నుంచి మండల కేంద్రంలోని పుస్తక భాండాగారానికి వస్తుంటారు. కానీ.. పెచ్చులూడుతున్న భవనం ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఉదయం 8 గంటల నుంచి 11 గంటలు, సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు కొనసాగిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. సమయపాలన పాటించడం లేదని పాఠకులు ఆరోపిస్తున్నారు. అయితే గ్రంథాలయంలో కనీస వసతులు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, వర్తమాన వ్యవహారాలు(కరెంట్ అఫైర్స్) తదితర బుక్స్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు, నిరుద్యోగులు వాపోతున్నారు. గ్రంథాలయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

భవనం ప్రారంభమెప్పుడో?

రూ.45 లక్షలతో మండల కేంద్రంలో నూతనంగా గ్రంథాలయ భవనం నిర్మించారు. ఆ భవనం పూర్తయి ఏడాది కావస్తున్నా.. దానిని వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు, పాలకులు చొరవ తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉన్న భవనంలో వసతులు కల్పించక.. కొత్త భవనాన్ని ప్రారంభించక నిర్లక్ష్యంగా వదిలేశారని పాఠకులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి.. నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, వసతులు కల్పించి, పుస్తకాలను అందుబాటులో తెచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని నూతన గ్రంథాలయ భవనం

దినపత్రికలకే పరిమితం..



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు లేవు. కేవలం వార్తా పత్రికలకు మాత్రమే పరిమితం అయింది. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ వేసినప్పటికీ.. ప్రిపరేషన్‌కు అవసరమయ్యే పుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి లైబ్రరీలో సౌకర్యాలు కల్పిస్తూ.. పుస్తకాలు అందుబాటులోకి తేవాలి.

– ప్రతాప్ గౌడ్, పాలేపల్లి గ్రామం

త్వరలో ప్రారంభిస్తాం



గ్రంథాలయ నూతన భవనాన్ని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుత గ్రంథాలయంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. లేని వాటిని తెప్పించేలా చర్యలు తీసుకుంటాం. వసతులు కల్పించేలా కృషి చేస్తాం.

– బంట్ల యాదయ్య గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్

నేడు జోడోయాత్ర

బంట్వారం: మండల పరిధిలోని మంగ్రాస్‌పల్లిలో ఆదివారం ఉదయం 8 గంటలకు హాత్ సే హాత్ జోడో యాత్ర ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాత్రలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొని, ప్రజా సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.

రేపు పెన్షనర్ల దీక్ష

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఆ సంఘం వికారాబాద్ అధ్యక్షుడు మాణిక్‌ప్రభు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పరిధిలోని అన్ని ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను మంజూరు చేయాలని కోరారు. 2023 సంవత్సరంలో పీఆర్‌సీ కమిటీ, ప్రతి జిల్లాలో అడ్వయిజరీ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతినెల 1న తప్పకుండా పింఛన్, అన్ని రకాల బకాయిలను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాణిక్ ప్రభు కోరారు.

11న సర్వసభ్య సమావేశం

బంట్వారం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 11న మండల పరిషత్ కార్యాలయంలో జరుగనుందని ఎంపీపీ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు



ప్రారంభానికి నోచుకోని స్కిల్‌డెవలప్‌మెంట్ భవనం

తాండూరు రూరల్: వేలు కాదు, లక్షలు కాదు.. ఏకంగా రూ.కోట్లు గుమ్మరించి నిర్మించిన ఈ అందమైన భవనాన్ని నిర్లక్ష్యానికి వదిలేశారు. వివిరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద రూర్బన్ పథకం కింద నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ భవనం వృథాగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూర్బన్ కింద అల్లాపూర్(ఎస్) క్లస్టర్‌ను ఎంపిక చేశాయి. ఇందులో భాగంగా రూ.2 కోట్లతో ఏడాదిన్నర క్రితం భవనాన్ని పూర్తిచేశారు. అయినా ఇప్పటి వరకు ఆ బిల్డింగ్‌ను వినియోగంలోకి తీసుకురాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. త్వరగా భవనాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్‌కు 176 బస్తాల కందులు

ధారూరు: వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 176 సంచుల కందులు వచ్చాయి. క్వింటాల్‌కు రూ.8 వేల నుంచి రూ.8,200 వరకు మద్దతు ధర పలికింది. వారం రోజుల్లో క్వింటాల్‌కు రూ.300 తగ్గడంపై రైతులు ఆందోళన చెందారు. వారం వారం ధరలు పెరుగుతాయనుకుంటే తగ్గుముఖం పట్టాయని వాపోయారు. మొక్కజొన్న 320 బస్తాలు రాగా.. బీట్లలో క్వింటాల్‌కు రూ.2 వేల నుంచి రూ.2,040 వరకు ధర పలికినట్లు మార్కెట్ కమిటీ తెలిపింది.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పూడూరు: ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. నెల రోజుల పాటు కఠోర దీక్షలు చేపట్టి, నియమనిష్టలు పాటిస్తుండడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

'కంటివెలుగు'లో కొనసాగించాలి

అనంతగిరి: కంటివెలుగు కార్యక్రమంలో డాటా ఎంట్రీగా పనిచేస్తున్న మమ్మల్ని కొనసాగించాలని పలువురు ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను కలిసి విన్నవించారు. కంటివెలుగును విజయవంతం చేయడానికి ఎంతో కృషి చేస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన ఆపరేటర్లు

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం

- ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న గులాబీ శ్రేణులు
- ప్రజల విశ్వాసం కోల్పోయిన ముఖ్యమంత్రి కేసీఆర్
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో టీఆర్ఆర్

పరిగి: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, సొంత పార్టీ నాయకులే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉన్నారని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పూడూర్ మండలం చిలాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు టీఆర్ఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపిస్తూ.. ప్రజలు ఆయన్ను నమ్మే స్థితిలో లేరని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమీ లేదని, ఎక్కడ చూసినా కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధే కనిపిస్తుందని తెలిపారు. ఎంతో మంది ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కలిసికట్టుగా ప్రజాసమస్యలపై బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, సర్పంచ్ రాములు, నాయకులు రామస్వామి, మల్లేశ్, కృష్ణ, ఇమ్రాన్, రాజు పాల్గొన్నారు.

అసమర్థ ప్రధానితో ఒరిగేదేమీ లేదు!



పరిగి: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నిరసన కార్యక్రమాల్లో సీపీఎం నేతలు

బొంరాస్‌పేట: 'నరేంద్ర మోదీ గో బ్యాక్' అంటూ సీపీఎం నేతలు నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దుద్యాల మండల కేంద్రంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలకు అసమర్థ పాలన అందిస్తున్న ప్రధాని మోదీ తెలంగాణకు వస్తే ఒరిగేదేమి లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేటు పరం చేయడం తాము వ్యతిరేకిస్తున్నామని, నిత్యావసరా సరుకుల ధరలు పెంచేసి సామాన్యులపై ఆర్థిక భారం మోపారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములు, మహేశ్, కరణ్, వెంకటయ్య, మొగులయ్య పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పరిగి: తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య ఆరోపించారు. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలతో పరిగి బస్టాండ్ ఎదుట మోదీ గో బ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ సంస్థల్లో ఒకటైన సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందనీ, ఇలా ప్రభుత్వ సంస్థలన్నింటినీ ఒక్కొక్కటిగా ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదనీ హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని చెప్పారు. అంతేకాకుండా తెలంగాణకు ఇచ్చిన హామీలు, విభజన వాటాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. హబీబ్, సత్తయ్య, శేఖర్, శ్రీనివాస్, రఘు, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల సాధనే ధ్యేయం



రిలే నిరాహార దీక్ష చేస్తున్న తట్టేపల్లి వాసులు

పెద్దేముల్: పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామ పంచాయతీని ప్రభుత్వం మండలంగా ప్రకటించే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని సాధన కమిటీ సభ్యులు చెప్పారు. రెండో రోజైన శనివారం తట్టేపల్లి వద్ద దీక్ష కొనసాగించారు. దీక్షలో తట్టేపల్లి ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్, పాషాపూర్ సర్పంచ్ భరత్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, మాజీ సర్పంచ్‌లు రాంచంద్రయ్య, వీరేశం, బాబు సింగ్, శివరాం నాయక్, గెమ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండల సాధనే తమధ్యేయమని, ప్రభుత్వం తట్టేపల్లిని మండలంగా ప్రకటించే వరకు ఈ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కర్ణాటకకు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ.. కనీస వసతులు లేవని, కావున వెనుకబడిన తట్టేపల్లిని మండలంగా ప్రకటించి, అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం



ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జోడో యాత్రలో కాంగ్రెస్ నేతలు

దౌల్తాబాద్: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శనివారం మండలంలోని చంద్రకల్, మాటూరులో ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, వెంకట్‌రెడ్డి, సత్యపాల్, నర్సింగ్ భాన్‌సింగ్, హన్మంత్, వెంకట్రాములు, మహిపాల్, కృష్ణ, రాజు, నర్సింహులు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పేదలకు, కార్యకర్తలకు అండగా ఉంటాం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



కుల్కచర్ల: బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: ప్రజాసంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, నిరుపేద ప్రజలకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని నర్సమ్మ రాంచంద్రయ్య అనారోగ్య సమస్యతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందగా.. శనివారం బాధితులకు రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా విఠలాపూర్‌కు చెందిన అంజిలయ్య విద్యుత్ ప్రమాదంతో మృతిచెందగా.. పార్టీ సభ్యత్వ బీమా ఉండటంతో వారికి రూ.2 లక్షల చెక్కు అందజేసి మాట్లాడారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ప్రభుత్వం, వ్యక్తిగతంగా తాము అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పార్టీ ప్రధాన కార్యదర్శి నర్సింహులు, మండల కోఆప్షన్ సభ్యుడు జుబేర్, నాయకులు వెంకటయ్య, రాంచంద్రయ్య, లక్ష్మణ్, రాజశేఖర్, కృష్ణయ్య, ఆంజనేయులు, రాజయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా..

పరిగి: యేసు ప్రభువు అందరికీ దేవుడని, కుల మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చెప్పారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా పట్టణ కేంద్రంలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభువు.. ప్రతి మనిషికి మోక్షం ప్రసాదించాలని బోధనలు చేశారని తెలిపారు. ఎంపీపీ అరవింద్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ప్రవీణ్ రెడ్డి, ఆంజనేయులు పాస్టర్లు బిషప్ యేసుదాసు, సుదర్శన్, జాన్సన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్

మొయినాబాద్: రక్తదానం చేయడమంటే ఇతరులకు ప్రాణదానం చేయడమేనని కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ అన్నారు. మొయినాబాద్‌కు చెందిన యువకుడు కావలి సిద్దు ముదిరాజ్ పుట్టినరోజు సందర్భంగా సిద్దన్న యువసేన ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రీమియర్ వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌కు 25 మంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన దర్శన్ మాట్లాడుతూ.. రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను నిలబెట్టడానికి యువత ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రహీందర్‌గౌడ్, యువకులు రామకృష్ణ, ఆంజనేయులు, నర్సింహచారి, సతీశ్, రాజేశ్, నవీన్, తరుణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

11నుంచి పల్లెబాట..

పరిగి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'పల్లెబాట' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11 నుంచి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పల్లెబాట నిర్వహిస్తామని, అందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. మొదటగా పరిగి మండలం బసిరెడ్డిపల్లి గ్రామం నుంచి మొదలువుతుందని, అటు నుంచి రంగాపూర్, మాదారం, పేటమాదారం, పోల్కంపల్లి, నజీరాబాద్‌తండా, బర్కత్‌పల్లి, రుక్కుంలపల్లి, నస్కల్ గ్రామాల్లో కొనసాగుతుందని తెలిపారు. గ్రామాల్లో నీరు, విద్యుత్, భూ సమస్యలు ఇలా ఊరు, ప్రజల సమస్యలు తెలుసుకుంటామని వెల్లడించారు. ఇంకా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేవోనని, గ్రామాభివృద్ధికి ఎన్ని నిధులు మంజూరయ్యాయి, ఏఏ పనులు జరిగాయని, ఇంకా చేపట్టాల్సిన పనుల గురించి చర్చించి.. వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.